సాగర్ ఆయకట్టుకు బోరే దిక్కు!

పంటల సాగుకు ప్రత్యామ్నాయాల అన్వేషణ

యాసంగి వరి సాగుకు నీటి కష్టాలు

పూర్తిగాఅడుగంటిన నాగార్జున సాగర్ జలాశయం

కొత్తగా బోర్లు.. బావులు తవ్వుతున్న రైతులు

సాగర్ ఆయకట్టు వెంబడి బోరుబండ్ల హడావుడి

సాగర్ పరిధిలో అనధికారికక్రాప్ హాలిడే అమలు

నల్లగొండ ప్రతినిధి, జనవరి 1 (నమస్తే తెలంగాణ): నాగార్జున సాగర్ ఆయకట్టు రైతులు మళ్లీ బోర్లు, బావుల తవ్వకంపై దృష్టిసారించారు. ఈ ఏడాది ఎగువ నుంచి రిజర్వాయర్‌కు చుక్కనీరు రాక పోవడంతో ఆయకట్టుపై తీవ్ర ప్రభావం పడింది. వానకాలంలో కురిసిన వర్షాలతో రైతులు సాగుకు ఉపక్రమించగా చివరి దశలో కేసీఆర్ సర్కార్ పంటలను కాపాడేందుకు నీరు విడుదల చేయడంతో రైతులు గట్టెక్కారు. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో సాగునీటి విడుదలకు పరిస్థితులు ఏమాత్రం అనుకూలంగా లేవు. రిజర్వాయర్‌లో కేవలం 12 అడుగుల మేర మాత్రమే నీరు అందుబాటులో ఉండటం..అది వచ్చే వేసవిలో తాగునీటి అవసరాలకే సరిపోయేలా లేదు. దీంతో ఈ సీజన్‌లో ఎడమ కాల్వ ద్వారా నీటి విడుదల లేనట్టేనని తెలుస్తున్నది. క్రాప్ హాలిడే అని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించికపోయినా అనధికారికంగా అదే పరిస్థితి కొనసాగుతున్నది. దీంతో రైతులంతా ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణపై దృష్టి సారించారు. ఆర్థికంగా ఉన్న రైతులు కొత్తగా బోర్లు వేయడంతోపాటు బావులు తవ్వించే పనిలో ఉన్నారు. మరికొందరు ఇప్పటికే ఉన్న పాత బావుల్లో పూడికలు తీస్తున్నారు.

రాష్ట్రం ఏర్పడ్డాక తొలిసారిగా

తెలంగాణ ఆవిర్భవించాక తొలిసారిగా నాగార్జున సాగర్ ఆయకట్టులో రైతులకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. కృష్ణా బేసిన్‌లో సరైన వర్షాలు కురవక ఎగువన శ్రీశైలం పూర్తిగా నిండలేదు. దీంతో నాగార్జునసాగర్‌కు వరద రాకపోవడంతో ఆయకట్టు రైతులకు శాపంగా మారింది. సాగర్‌లో ప్రస్తుతం ఉన్న నీళ్లు తాగునీటి అవసరాలకు సరిపడే పరిస్థితి కూడా లేదు. సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 522.80 (154.43టీఎంసీలు) అడుగుల మేర నీరు ఉన్నది. సాగర్ రిజర్వాయర్ డెడ్ స్టోరేజీ 510 అడుగులు. డెడ్ స్టోరేజీ కంటే అదనంగా 12 అడుగుల నీరు మాత్రమే రిజర్వాయర్‌లో అందుబాటులో ఉన్నట్టు లెక్క. ప్రభుత్వం అనధికారికంగా పంటలకు నీరిచ్చే పరిస్థితి లేదని సంకేతాలు ఇస్తున్నది. సాగర్ కుడి, ఎడమ కాల్వలకు సాగునీటిని విడుదల చేయలేమని రైతులు రబీలో క్రాప్ హాలిడేగా పాటించాలని ఇటీవల ఎన్నెస్పీ చీఫ్ ఇంజినీర్ అజయ్‌కుమార్ సూచించారు.

సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పరిధి సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం సీతారాంపురంలో బోరు వేస్తున్న రైతు

ఏ పంటలూ సాగు చేసే పరిస్థితి లేదు

సాగర్ ఆయకట్టు కింద నాకు మూడెకరాల భూమి ఉంది. ఈ పదేండ్ల సంది పంటలు మంచిగానే పండినయి. ఈ ఏడాది సాగర్ కాల్వకు నీళ్లు రాక వానకాలం, యాసంగి బీడు పెట్టిన. కాల్వ కింద భూముల్లో మెట్ట పంటలు పండే పరిస్థితి లేదు. గతంలో మినుములు, పెసర్లు వర్షాలకు సాగు చేసినా, ఎన్నడూ పంటలు చేతికి రాక నష్టాలే మిగిలినయ్. అందుకే ఈ ఏడాది ఏ పంటా వేయలేదు. పంటలు పండించకపోవడంతో కుటుంబాలు గడవడం కష్టంగా మారింది. మాలాంటి సన్నకారు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. –ఎలకాని రమణ, రైతు, దొండవారిగూడెం, మిర్యాలగూడ మండలం

ఎడమ కాల్వ పరిధిలో జిల్లాల వారీగా ఆయకట్టు

ఉమ్మడి నల్లగొండ 3.94 లక్షల ఎకరాలు	ఖమ్మం 3.46 లక్షల ఎకరాలు
ఏపీలోని కృష్ణా 4.04 లక్షల ఎకరాలు	మొత్తం: 11.44 లక్షల ఎకరాలు

బోరు బండ్ల హడావుడి

స్వరాష్ట్రంలో వ్యవసాయానికి కేసీఆర్ సర్కార్ ఇచ్చిన తోడ్పాటుతో రైతులు పంటల సాగులో దూసుకుపోయారు. సమృద్ధిగా సాగునీరు, నిరంతర ఉచిత కరెంట్, రైతుబంధు, పంటల కొనుగోళ్లతో ఎలాంటి ఇబ్బంది లేకుండాపోయింది. ఈ వానకాలంలో సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.3 వేల వరకు ధర పలకడంతో రైతులు యాసంగిలోనూ సాగుకు ఉపక్రమిస్తున్నారు. అయితే, సాగర్ నుంచి సాగునీటి విడుదలకు అవకాశాలు లేకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ప్రస్తుతం ఆయకట్టు పరిధిలో బోరుబండ్ల హడావుడి కొనసాగుతున్నది. రైతులు కొత్తగా బోర్లు వేస్తూ భగీరథ యత్నాలు సాగిస్తున్నారు. మరికొందరు రైతులు కొత్తగా బావులు తవ్విస్తున్నారు. ఇంకొందరు పాత బావుల్లో పూడికలు తొలిగించే పనిలో నిమగ్నమయ్యారు. ఎలాగైనా సరే భూములు పడావు పెట్టకుండా వరి సాగు చేయాలన్న సంకల్పం కనిపిస్తున్నది. ఇలా బోర్లు, బావుల కింద సుమారు లక్ష ఎకరాల వరకు సాగులోకి తెచ్చే ప్రయత్నాల్లో రైతులు బిజీగా కనిపిస్తున్నారు. సొంత నీటి వసతి ఉన్న రైతులు ఇప్పటికే వరి నార్లు పోసుకుని సాగుకు సిద్ధంగా ఉన్నారు.

3 లక్షల ఎకరాలు పడావు?

సాగర్ ఆయకట్టు పరిధిలో 2015 యాసంగి తర్వాత తొలిసారిగా రైతుల భూములు పడావు పడనున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో లక్ష ఎకరాల్లో ప్రత్యామ్నాయ మార్గాల్లో సాగునీరు అందనున్నా మిగతా 3 లక్షల ఎకరాలకు సాగునీరు లేనట్టే. దీంతో ఈ 3 లక్షల ఎకరాలు బీడుగానే ఉండనున్నాయి. నాన్ ఆయకట్టులో బోర్లు, బావులపై ఆధారపడే రైతులు యాసంగిలో కొంతమేర వరితోపాటు మెట్ట పంటలైన వేరువనగ, పెసర, మినుము వంటివి పండిస్తారు. కానీ, సాగర్ ఆయకట్టులో అలాంటి పరిస్థితి లేక పూర్తిగా బీళ్లుగా మారనున్నాయి. మరోవైపు సొంత సాగునీటి వసతి ఉన్న రైతులు సైతం వరికి బదులుగా మెట్ట పంటలు సాగుచేస్తేనే మేలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. చివరి దశలో నీరు ఎక్కువగా అవసరమున్న సందర్భాల్లో భూగర్భజలాలు అడుగంటితే ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. అందువల్ల మెట్ట పంటల వైపు మొగ్గు చూపితేనే బెటర్ అని పేర్కొంటున్నారు.

నాగార్జునసాగర్ ఆయకట్టు వివరాలు

2014 నుంచి నేటి వరకు యాసంగిలో నీటి విడుదల వివరాలు

నీటి విడుదల తేదీ	నీటిమట్టం (అడుగులు)	కెపాసిటీ (టీఎంసీల్లో)
11/12/2014	558.70	229.37
2015	యాసంగి	నీటి విడుదల లేదు
5/12/2016	526.40	161.20
11/12/2017	558.10	227.97
27/12/2018	548.10	205.61
16/12/2019	578.80	279.54
07/12/2020	588.60	307.87
16/12/2021	586.00	300.32
06/12/2022	586.00	300.32

2023 యాసంగికి ఇప్పటివరకూ నీటి విడుదల షెడ్యూల్ లేదు.

భయం భయంగానే సాగు

నేను కొన్నేండ్లుగా 12 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. ఆరెకరాలు సొంతం కాగా, మరో ఆరెకరాలు కౌలుకు తీసుకున్న. గతంలో సాగర్ ఎడమ కాల్వ నీళ్లు రావడం వల్ల వరి సాగుకు ఎలాంటి ఇబ్బంది పడలేదు. ఈ ఏడాది సరిపడా సాగు నీరు ఇవ్వక పోవడంతో బోర్ల కింద 8 ఎకరాలు మాత్రమే వరి వేసిన. వారం, పది రోజులుగా కరెంట్ సక్రమంగా ఉండట్లేదు. కరెంట్ కోతలు ఎక్కువయ్యాయి. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ రావట్లేదు. కరెంట్ సరఫరా ఇలాగే ఉంటే పంట పొట్ట దశకు వచ్చినప్పుడు ఎండిపోయే పరిస్థితి వస్తదేమోనని భయంగా ఉంది.

-అనుముల సుధాకర్‌రెడ్డి, రైతు, త్రిపురారం

భూమి పడావు పెట్టాల్సి వచ్చింది

నాకు నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉంది. గతేడాది వరకు ప్రభుత్వం ఎడమ కాల్వకు సాగునీరు ఇవ్వడంతో వరి మంచిగా సాగు చేసిన. ఈ ఏడాది వానకాలంతోపాటు యాసంగిలో ప్రభుత్వం ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయకపోవడంతో భూమి పడావు పెట్టాల్సి వచ్చింది.

-లకుమల్ల మధుబాబు, రైతు, ఎర్రబెల్లి, నిడమనూరు మండలం

వరుసగా సాగునీరు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే

నాగార్జున సాగర్ నిర్మాణం అయిన తరువాత వరుసగా తొమ్మిదేండ్ల పాటు రెండు కార్లకు ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసిన దాఖలాలు లేవు. కానీ, స్వరాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం 2015 మినహా వరుసగా 17 కార్లు ప్రణాళికాబద్ధంగా సాగునీరు ఇచ్చింది. సాగు నీటిని సద్వినియోగం చేసి రాష్ట్రాన్ని ధాన్యాగారంగా మార్చిన ఘనత కేసీఆర్‌దే. కేసీఆర్ ప్రభుత్వం చేసిన మేలును రైతులు ఎప్పటికీ మరువరు.

-రాయనబోయిన రామలింగయ్య, రైతు, పేరూరు, అనుముల మండలం

లోకం పోకడ

'గృహలక్ష్మి' అంటే మా భార్యేగదా.. ఇంట్లో వుందయ్యా!

స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షుడిగా వీరయ్య

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): స్వేరోస్ సంస్థ నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక స్వేరోస్ రాష్ట్ర చీఫ్ కన్వీనర్ బల్గురి దుర్గయ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షుడిగా చిలకబత్తిని వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా దారమల్ల ప్రకాశ్, కోశాధికారి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అధికార ప్రతినిధిగా ప్రణీత శుభశ్రీ, ఉపాధ్యక్షులుగా మచ్చ నరసయ్య, శ్యామల, అజయ్, జగన్‌లను ఎన్నుకున్నారు. పులేందర్, రాజు, సాయన్న, దిలీప్, మౌనిక, కిరణ్, కపిల్, రవి, మారుతి, సురేశ్, రాజు, మనోజ్, ప్రవీణ్, పవన్, రాజ్ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ మామిడాల ప్రవీణ్, వైస్ చైర్మన్ బాలప్రసాద్, ఉషన్న, ఎర్రోళ్ల సత్యం, పుల్లా కిషన్, గడప రాజు తదితరులు పాల్గొన్నారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	10.6°c	34.0°c
మెదక్	12.9°c	34.0°c
ఆదిలాబాద్	13.2°c	29.8°c
నల్లగొండ	16.0°c	32.5°c
కరీంనగర్	16.0°c	29.0°c
హైదరాబాద్	16.7°c	28.7°c
వరంగల్	17.0°c	29.0°c
నిజామాబాద్	17.1°c	30.5 °c
మహబూబ్‌నగర్	17.6°c	30.5°c
ఖమ్మం	18.0°c	30.0°c

పుట్టిన తేదీ 01-01-2024!

కొత్త ఏడాది తొలిరోజు కోరి దవాఖానలో 42 మంది శిశువుల జననం

సుల్తాన్‌బజార్, జనవరి 1: ఆంగ్ల సంవత్సరాదిగా జనవరి 1న సంబురాలు జరుపుకోవడం ప్రపంచవ్యాప్తంగా ఆనవాయితీగా వస్తున్నది. కొత్త సంవత్సరంలో తొలి రోజు పుట్టిన పిల్లలకు ప్రత్యేకత ఉంటుంది. కోఠిలోని సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖానలో డిసెంబర్ 31 అర్ధరాత్రి 12 గంటల అనంతరం జనవరి ఒకటిగా తేదీ మారిన తర్వాత 42 మంది శిశువులు పుట్టడం విశేషం. అందులో 23 మంది మగ, 19 మంది ఆడ శిశువులు ఉన్నారని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ కే రాజ్యలక్ష్మి వెల్లడించారు.

జీవోలకే పరిమితమైన 'ఆఫీసర్'

- నర్సుల హోదా మార్చుతూ ఉత్తర్వులు
- ఇప్పటికీ రికార్డుల్లో పాత హోదానే
- కొత్త ఏడాదైనా కరుణించాలని వినతి

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): నర్సుల సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం కల్పించిన 'ఆఫీసర్' హోదా ఒక్క అడుగు దూరంలో ఆగిపోయింది. దాదాపు మూడు నెలలుగా జీవోలకే పరిమితమైంది. కొత్త ప్రభుత్వం కొత్త ఏడాదిలో అయినా తీపి కబురు చెప్పాలని నర్సులు కోరుతున్నారు. వృత్తికి మరింత గౌరవం కల్పించేలా తమ హోదాను 'నర్సింగ్ ఆఫీసర్'గా మార్చాలంటూ నర్సులు దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వం వారి కలను సాకారం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ దవాఖానల్లో విధులు నిర్వర్తిస్తున్న నర్సింగ్ సిబ్బంది హోదాను ఉన్నతీకరిస్తూ గత ఏడాది అక్టోబర్ 6న ఉత్తర్వులు జారీ చేసింది. స్టాఫ్ నర్స్‌ను 'నర్సింగ్ ఆఫీసర్'గా, హెడ్ నర్స్‌ను 'సీనియర్ నర్సింగ్ ఆఫీసర్'గా, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2ను 'డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్'గా, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1ను 'చీఫ్ నర్సింగ్ ఆఫీసర్'గా, పబ్లిక్ హెల్త్ విభాగంలోని దవాఖానల్లో పనిచేసే పబ్లిక్ హెల్త్ నర్స్‌లను 'పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్'గా మార్చింది. వైద్యారోగ్య శాఖతోపాటు ఇతర శాఖల్లో విధులు నిర్వర్తించే నర్సింగ్ సిబ్బందికి దీనిని వర్తింపజేసింది. ఈ హోదా మార్పు వెంటనే అమల్లోకి వస్తుందని ఆ జీవోల్లో పేర్కొన్నది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 14 వేల మంది నర్సులు సంతోషం వ్యక్తంచేశారు. తమకు సమాజంలో మరింత గౌరవం పెరిగిందంటూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే చేతికందిన ముద్ద నోటికా డిదాకా రానట్టు మూడు నెలలు గడిచినా ఇంకా సర్వీస్ రికార్డుల్లోగానీ, వేతన రసీదుల్లో (పే స్లిప్‌లో) గానీ ఇంకా హోదా మారలేదు. జీవోలు విడుదలైన మూడు రోజులకే ఎన్నికల కోడ్ రావడంతో మిగితా ప్రక్రియ ఆగిపోయింది. దీంతో 'నర్సింగ్ ఆఫీసర్' ఇంకా జీవోలకే పరిమితమైంది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం తమ సమస్యపై దృష్టి సారించాలని, వెంటనే హోదాను మార్చాలని నర్సులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

కొత్త నర్సులకు నేరుగా 'ఆఫీసర్'

ప్రస్తుతం వైద్యారోగ్యశాఖలో కొత్తగా 7,094 పోస్టుల భర్తీ జరుగుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా 9 విభాగాల్లో 5,204 స్టాఫ్‌నర్స్ పోస్టులకు ప్రభుత్వం 2022 డిసెంబర్ 30న నోటిఫికేషన్ విడుదల చేసింది. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు మరో 1890 పోస్టులను ప్రభుత్వం జత చేసింది. దీంతో మొత్తం పోస్టుల సంఖ్య 7,094కు పెరిగింది. ఇటీవలే ఫలితాలు వెల్లడించారు. ప్రాథమిక తుది జాబితాను నేడో రేపో విడుదల చేయనున్నారు. వీరికి పోస్టింగ్ ఇచ్చే సమయంలోనే 'నర్సింగ్ ఆఫీసర్'గా పేర్కొనాలని నర్సులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

5న చేనేతపై 'జీరో జీఎస్టీ ఉద్యమం'

ద్వితీయ వార్షికోత్సవం

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): చేనేతపై 'జీరో జీఎస్టీ ఉద్యమం' ద్వితీయ వార్షికోత్సవాన్ని నారాయణగూడలోని పద్మశాలిభవన్‌లో ఈ నెల 5న నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని అఖిల భారత పద్మశాలి సంఘం చేనేత విభాగం అధ్యక్షుడు యర్రమాద వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 5 శాతం జీఎస్టీ పన్నును పరిహారంగా చెల్లిస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున జీఎస్టీ పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి అధ్యక్షతన కొనసాగే ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పద్మశాలి ప్రజాప్రతినిధులు, నాయకులు, సంఘం నేతలు పాల్గొనాలని కోరారు.

దేవాదుల ప్రాజెక్టు పరిధిలోని హనుమకొండ జిల్లా ధర్మసాగర్ రిజర్వాయర్‌లో నిండుగా నీళ్లు

దేవాదుల కింద సస్యశ్యామలం

- కేసీఆర్ ప్రభుత్వ చొరవతో పుష్కలంగా సాగునీరు
- 2014లో 47,671 ఎకరాలకు నీరు
- నేడు 2.93 లక్షల ఎకరాలకు జలాలు
- దేవాదుల ప్రాజెక్టుకు నిరంతరం నీరు
- పూర్తిగా మారిన గ్రామీణ ముఖచిత్రం

వరంగల్, జనవరి 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఒకప్పుడు తెలంగాణలోనే అత్యంత కరువు ప్రాంతంగా ఉన్న జనగామ, సిద్దిపేట, హనుమకొండ జిల్లాల్లోని ప్రాంతాలు కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక చొరవతో పచ్చగా మారాయి. అసంపూర్తిగా ఉన్న దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయడంతో పంటలకు నెలవుగా మారాయి. ఒక పంట, రెండు పంటలు, ఒక్కోసారి మూడో పంట సాగయ్యేలా ప్రస్తుతం సాగునీరు పుష్కలంగా అందుతున్నది. దేవాదుల పెండింగ్ పనులను పూర్తి చేయడంతో ఇది సాధ్యమైంది. ప్రతి ఎకరాకు సాగునీరు అందించే లక్ష్యం సాకారమైంది.

2,93,943 ఎకరాలకు నీరు

దేవాదుల, ఎస్సారెస్పీ ఆయకట్టును స్థిరీకరించే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం 2014 నుంచి ప్రత్యేక చర్యలు చేపట్టి పూర్తిచేసింది. హనుమకొండ, వరంగల్, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, సిద్దిపేట జిల్లాల్లోని దేవాదుల పరిధిలోని 6.14 లక్షల ఎకరాలకు, ఎస్సారెస్పీ పరిధిలోని 7.5 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంతో సమ్మక్క బరాజ్‌తోపాటు పనులు చేపట్టింది. ఏడాదిలో 170 రోజులపాటు ప్రతిరోజు 5.18 టీఎంసీల చొప్పున నీటిని ఎత్తిపోసేలా పనులు పూర్తి చేసింది. దీంతో ఇప్పుడు ప్రతి ఎకరాకు సాగునీరు అందుతున్నది. వరంగల్ మహానగరంతోపాటు ఎన్నో గ్రామాలకు తాగునీరు అందుతున్నది. దేవాదుల కింద 5.14 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా.. 2014 వరకు 47,671 ఎకరాలకే సాగునీరు అందేది. తెలంగాణ వచ్చిన తర్వాత సాగునీటి వసతి పెరుగుతూ వచ్చింది. ఈ ఏడాది వరకు 2,93,943 ఎకరాలకు సాగునీరు అందింది.



ఏడాది పొడవునా ఎత్తిపోతల..

ఉమ్మడి రాష్ట్రంలో చేసిన పనుల ప్రకారం దేవాదుల ప్రాజెక్టు వద్ద గోదావరి నీటి మట్టం 71 మీటర్లు ఉన్నప్పుడే మోటర్లు నీళ్లను ఎత్తిపోస్తాయి. వానలు బాగా పడే రోజుల్లో మాత్రమే ఆ నీటి మట్టం ఉంటుంది. దీంతో మొదట నీటిని రిజర్వాయర్లకు, అక్కడి నుంచి పొలాలకు చేర్చాల్సిన పరిస్థితి. 71 మీటర్ల మేరకు నీటి మట్టం ఏడాదిలో గరిష్ఠంగా 3 నెలలే ఉంటుంది. ఆ మేరకే మోటర్లు నడిచేవి. ప్రతి ఎకరాకూ నీళ్లు ఇచ్చే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం అన్ని రిజర్వాయర్లను, కాలువలను పూర్తిచేసింది. దేవాదుల, ఎస్సారెస్పీ ఆయకట్టు పూర్తి స్థిరీకరణ కోసం తుపాకులగూడెం వద్ద బరాజ్‌ను నిర్మించింది. దేవాదుల పంప్‌హౌస్ ఉన్న ప్రదేశం నుంచి 5 కిలోమీటర్ల దిగువన ఈ బరాజ్‌ను నిర్మించింది. 83 మీటర్ల మేరకు నీటిని నిల్వ చేసేలా 92 మీటర్ల ఎత్తుతో బరాజ్ నిర్మించింది. ఏడాది పొడవునా మోటర్లు నడిచేలా, నీటి నిల్వ ఉండేలా దీనిని నిర్మించింది. ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం రూ.104 కోట్లతో 3 లిఫ్టులకు శంకుస్థాపన చేసింది. వీటితో 30 గ్రామాల్లోని 6,790 ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా చర్యలు చేపట్టింది.

రిజర్వాయర్ (పునరుద్ధరించినవి)	నీటి నిల్వ సామర్థ్యము(టీఎంసీ)
నర్సింగాపూర్	0.051
ధర్మసాగర్	1.500
పాలకుర్తి	0.422
చెన్నూరు	0.581
అశ్వరావుపల్లి	0.710
గండిరామారాం	0.400
వెల్దండ	0.150
ఐనాపూర్	0.120
మారెడ్డి చెరువు	0.120
స్టేషన్ ఘన్‌పూర్	1.570
మొత్తం	5.624

దేవాదుల నీటితో నింపిన చెరువులు (వానకాలం, యాసంగి కలిపి)

సంవత్సరం	చెరువుల సంఖ్య
2014-15	43
2015-16	224
2016-17	170
2017-18	319
2018-19	502
2019-20	732
2020-21	817
2021-22	819
2022-23(వానకాలం)	528

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌జీఆర్ఐలో..

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 9
- పోస్టులు: జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్
- విభాగాలు: ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, స్టోర్స్ పర్చేజ్, జనరల్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 26
- వెబ్‌సైట్: www.ngri.org.in

గోల్కొండ ఆర్మీ స్కూల్‌లో...

హైదరాబాద్ గోల్కొండ ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 48
- పోస్టులు: పీజీటీ, టీజీటీ, పీఆర్‌టీ, హెడ్మాస్టర్, ప్రీ ప్రైమరీ టీచర్లు
- అర్హతలు: ఆయా పోస్టులకు వేర్వేరు అర్హతలు ఉన్నాయి. వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 20
- వెబ్‌సైట్: https://www.apsgolconda.edu.in

టీఎంసీలో..

టాటా మెమోరియల్ సెంటర్ (టీఎంసీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 47
- పోస్టులు: మెడికల్ ఆఫీసర్
- విభాగాలు: న్యూక్లియర్ మెడిసిన్, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, పాథాలజీ, పల్లెటివ్ మెడిసిన్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 9
- వెబ్‌సైట్: https://tmc.gov.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- చైల్డ్ డెవలప్‌మెంట్ సైకాలజీ (టెట్), జనరల్ సైన్స్, ఎకానమీ (గ్రూప్స్) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.